# మెదక్‌లో.. రాష్ట్రంలో హ్యాట్రిక్ ఖాయం



మెదక్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు

- బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు
- మెదక్‌లో పద్మాదేవేందర్‌రెడ్డి గెలుపు తథ్యం
- రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం
- ఇతర పార్టీలకు ఓటేసి రిస్క్ ఎందుకు తీసుకోవాలి
- ప్రజలకు ఏం కావాలో ఆలోచించే గొప్ప లీడర్ సీఎం కేసీఆరే కావాలి..
- టిక్కెట్లను అర్రాస్ పాటలాగా అమ్ముకుంటున్న కాంగ్రెస్
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు
- మెదక్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి నామినేషన్

మెదక్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): మెదక్‌లో పద్మమ్మ గెలుపు.. రాష్ట్రంలో కేసీఆర్ గెలుపును ఎవరూ ఆపలేరని.. ఈ రెండు కూడా ఖాయమైపోయాయని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం మెదక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసిన కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డితో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. ఇంత మంచిగా కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు ఏం కావాలో ఆలోచిస్తూ, పని చేస్తున్నప్పుడు ఇతర పార్టీలకు ఓటేసి రిస్క్ ఎందుకు తీసుకోవాలని రాష్ట్ర ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు.. అడగకున్నా, ఎన్నికల్లో చెప్పకపోయినా పంట పంటకు రైతు బంధు ఇస్తున్న కేసీఆర్ ఉండగా ఇతర పార్టీలకు ఎందుకు ఓటేయాలని ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, రాష్ట్రాల్లో ఎక్కడా సంక్షేమ పథకాలు తెలంగాణ ప్రభుత్వ తరహాలో అమలుచేయలేదన్నారు. మరి ఆనాడు చేయలేదు.. దేశంలో ఉన్న ఇతర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న చోట కూడా కాంగ్రెస్ పార్టీ చేయలేదు. ఆసరా పింఛన్ పెంచాలన్నా, రైతు బంధు పెంచాలన్నా, కల్యాణ లక్ష్మి పెంచాలన్నా మెదక్‌లో అయితే పద్మమ్మనో, సిద్దిపేటలో అయితే తననో కలిసి ప్రజలు అడుగుతారు. వెంటనే తాము వెళ్లి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి దాన్ని తెచ్చి ఇవ్వగలుగుతాం.. కానీ కాంగ్రెస్, బీజేపీల పరిస్థితి ఏదీ కావాలన్నా ఢిల్లీకి వెళ్లాలి.. టికెట్ కావాలన్నా ఢిల్లీకే పోవాలి.. ప్రచారం చేయాలన్నా ఢిల్లీ నుంచే నాయకులు రావాలి.. ఆసరా పింఛన్లు పెంచాలన్న ఢిల్లీ నాయకుల్నే అడగాలి.. అందుకే ఢిల్లీ పార్టీలను నమ్ముకుని మోసపోవద్దని అన్నారు.

**టిక్కెట్లను అర్రాస్ పాటలాగా అమ్ముకుంటుండ్రు..**

కాంగ్రెస్ పార్టీ టిక్కెట్లను తక్కట్ల పెట్టి అమ్ముకుంటుండ్రని, అర్రాస్ పాట పాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులే చెబుతున్నారు. ఇచ్చిన టికెట్లకే ఆగమాగం అవుతున్నది. రేపు రాష్ట్రం వీళ్ల చేతులోకి వెళితే ఏమైపోతదో.. కుక్కలు చింపిన విస్తరాకులాగా అవుతుంది. ఏబుల్ లీడర్ స్టేబుల్ గవర్నమెంట్ కేసీఆర్ చేతుల్లోనే ఉంటే రాష్ట్రం బాగుంటుంది. రాష్ట్రం ముందుకు పోతుంది. పుట్టిన బిడ్డ తల్లి చేతుల్లో ఉంటే ఎంతో సురక్షితంగా ఉంటుందో.. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ఈ రాష్ట్రం సాధించిన కేసీఆర్ చేతుల్లో ఉంటేనే బాగుంటుంది.. ఈ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకుపోతుంది. రాష్ట్ర ప్రజలందరూ కూడా ఆలోచించాలి.. కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలి.. అని మంత్రి హరీశ్‌రావు అన్నారు.



చిన్నారిని ఎత్తుకుని ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి పద్మారెడ్డి



ముద్దాపూర్‌లో మహిళలతో కలిసి ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి




మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారెడ్డి తరపున నామినేషన్ సెట్ వేస్తున్న జడ్పీటీసీలు సుజాత, గడీల షర్మిల, కౌన్సిలర్లు

# ఏడో రోజు 17 నామినేషన్లు

- మెదక్ నియోజకవర్గంలో తొమ్మిది, నర్సాపూర్ నియోజకవర్గంలో ఎనిమిది నామినేషన్లు
- నేటితో ముగియనున్న నామినేషన్ల ఘట్టం

మెదక్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం మెదక్ జిల్లాలో మొత్తం 17 నామినేషన్లు వేశారు. మెదక్ నియోజకవర్గంలో ఆరుగురు అభ్యర్థులు 9 నామినేషన్లు, నర్సాపూర్ నియోజకవర్గంలో ఏడుగురు అభ్యర్థులు 8 నామినేషన్లు దాఖలు చేశారు. మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి నామినేషన్ పత్రాలను మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, గంగాధర్, అంజాగౌడ్, రిటర్నింగ్ అధికారి అంబదాస్ రాజేశ్వర్‌కు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఒక సెట్ నామినేషన్ పత్రాలను కౌన్సిలర్లు రాగి వనజ, శంసున్నీసాబేగం, జయశ్రీ, జడ్పీటీసీలు సుజాత, గడీల షర్మిల అందజేశారు. సీపీఎం నుంచి పుల్లయ్య నామినేషన్ వేయగా, బీజేపీ నుంచి పంజా విజయ్‌కుమార్ రెండు సెట్ల నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రోహిత్‌రావు రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా జి.నాగరాజు నామినేషన్ వేశారు.

**నర్సాపూర్ నియోజకవర్గంలో...**

నర్సాపూర్ నియోజకవర్గంలో గురువారం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇండిపెండెంట్ అభ్యర్థిగా ప్రవీణ్‌రెడ్డి, బీజేపీ నుంచి మురళీధర్ యాదవ్, కాంగ్రెస్ నుంచి ఆవుల రాజిరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా సీహెచ్ లక్ష్మీరెడ్డి, సీహెచ్ నవీన్‌కుమార్ రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఇండియా ప్రజా బంధు పార్టీ నుంచి జనపాటి నర్సింలు, స్వతంత్ర అభ్యర్థిగా నారాయణరెడ్డి నామినేషన్లు వేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. వారి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి క్షుణ్ణంగా పరిశీలించి, స్వీకరించారు. నామినేషన్ వేసిన అభ్యర్థులకు ఎన్నికల నియమావళి కిట్‌ను అందజేశారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.

**నేటితో నామినేషన్ల ఘట్టానికి తెర**

జిల్లాలో నామినేషన్ల పర్వం చివరి దశకు చేరింది. ఈ నెల 10న నామినేషన్ల ఘట్టానికి తెరపడనుంది. ఈనెల 3వ తేదీతో ప్రారంభమైన నామినేషన్ల పర్వం శుక్రవారంతో పూర్తవుతుంది. గురువారం ఏకాదశి కావడంతో మంచి రోజని అధికార పార్టీతోపాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఇతర పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు నామినేషన్లు వేసిన వారు కూడా మరో సెట్ సమర్పించారు. శుక్రవారం చివరి రోజు కావడంతో అభ్యర్థులు మరిన్ని నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నది.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలే..

- సీఎం కేసీఆర్‌తోనే తండాలకు స్వయం ప్రతిపత్తి
- కాంగ్రెస్‌లో ఎప్పటికీ తెగని కుర్చీల కొట్లాట
- మైనంపల్లికి ఇప్పడే మెదక్ ఎందుకు గుర్తొచ్చింది?
- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి
- పాపన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

పాపన్నపేట, నవంబర్9: కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కష్టాల పాలవుతామని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముద్దపూర్, రామతీర్థం, నార్సింగిరావుపల్లి తండా, మొదల్లకుంట తండా, కందిపల్లి, అర్మియా తండా, పాత లింగాయి పల్లి, చీకోడ్, కొంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నదన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే అసైన్‌మెంట్ భూముల నిబంధనలను సులభతరం చేసి భూ హక్కులు కల్పిస్తామన్నారు. తండాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న లక్ష్యంతోనే గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. పోడు భూములకు సైతం భూ హక్కులు కల్పించామన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతు బంధు ఆపాలని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా గెలవలేరన్నారు. కాంగ్రెస్‌లో ఎప్పటికీ కుర్చీల కొట్లాట ఉంటుందన్నారు. గతంలో గెలిచిన మైనంపల్లి మెదక్ వద్దు హైదరాబాద్ ముద్దు అని వెళ్లి, మళ్లీ 13 ఏళ్లకు మెదక్ నియోజకవర్గానికి కొడుకును తీసుకొచ్చారన్నారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మవద్దని, నమ్మితే నట్టేట ముంచుతారని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఆమె వెంట మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, జిల్లా రైతు కమిటీ అధ్యక్షుడు సోములు, పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కుమ్మరి జగన్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌లు గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, దానయ్య, నవీన్, రాణి కిష్టయ్య, విజయ తిరుపతిరెడ్డి, ప్రవంతి శ్రీనివాస్, సబితా రవీందర్, పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, డైరెక్టర్లు మనోహర్, వెంకటేశం, సాయిలు, పెంటయ్య, నాయకులు దుర్గయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



రామతీర్థంలో కోలాటలు ఆడుతున్న నాయకులు



ముద్దాపూర్‌లో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి



ఘన స్వాగతం పలుకుతున్న రామతీర్థం ప్రజలు

# మాజీ మంత్రి జోగురామన్న వాహనం తనిఖీ



మాజీ మంత్రి జోగురామన్న వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట, నవంబర్ 9: ఎన్నికల నేపథ్యంలో నిజాంపేటలోని నస్కల్ ఎక్స్ రోడ్డు వద్ద చెక్‌పోస్టును పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు అటుగా వెళ్తున్న అటవీ శాఖ మాజీ మంత్రి జోగు రామన్న వాహనాన్ని ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి భద్రతా బలగాలతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రూ.50 వేలకు మించి డబ్బు తమ వెంట తీసుకెళ్లరాదని సూచించారు.ఎన్నికల ప్రక్రియలో భాగంగా తన వాహనం తనిఖీకి మాజీ మంత్రి జోగురామన్న పూర్తిగా సహకరించారని ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీలో ఎలాంటి పత్రాలు లేకుండా ఓ వ్యక్తి వద్ద రూ.1,14,050 పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.